


అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశంలో ట్రంప్ నిర్ణయాలకు ప్రజల మద్దతు భారీగా తగ్గింది. రాయిటర్స్-ఇప్సాస్ నిర్వహించిన పోల్‌లో ఈ విషయం వెల్లడైంది. వలసలపై ఆయన తీసుకుంటున్న కఠినచర్యలు చాలాదూరం వెళ్లాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వలసదారుల్ని అడ్డుకోవడానికి అమెరికాలోని పలు ప్రాంతాల్లో ట్రంప్ యంత్రాంగం ఇమిగ్రేషన్ ఏజెంట్లను మోహరించింది. దీనికి నిరసనగా జరిగిన ఘర్షణల్లో ఆ ఏజెంట్ల చేతిలో శనివారం మినియాపొలిస్?లో మరో అమెరికా పౌరుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు ముందు, తర్వాత అంటే శుక్రవారం నుంచి ఆదివారం మధ్య ఈ పోల్ చేపట్టగా.. ట్రంప్? నిర్ణయాలను ఆమోదించేవారి సంఖ్య తగ్గిపోయింది. తాజాగా 39 శాతం మంది ఆమోదించగా.. అంతకుముందు ఆ రేటు 41 శాతంగా ఉంది. 53 శాతం మంది ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసలకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేశారు. ఈ విషయంలో తొలుత ఆయనకు ప్రజల నుంచి భారీ ఆమోదం లభించింది. గత ఫిబ్రవరిలో 50 శాతం మంది ఆయన విధానాలకు అనుకూలంగా స్పందించడం గమనార్హం.




గ్రీన్‌లాండ్ వ్యవహారంలో ఐరోపా కూటమి, అమెరికాల మధ్య విభేదాలు తలెత్తిన వేళ.. నాటో చీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యం మద్దతు లేకపోతే యూరప్‌కు రక్షణే లేదని హెచ్చరించారు. బెల్జియంలో ఈయూ చట్టసభ్యులతో జరిగిన సమావేశంలో నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే ఈ విషయం గురించి ప్రస్తావించారు. "అమెరికా సాయం లేకుండానే యూరోపియన్ యూనియన్ లేదా ఐరోపా తనను తాను రక్షించుకోగలదని ఎవరైనా అనుకుంటే.. అలాగే భ్రమపడుతూ ఉండండి. ఎందుకంటే అది సాధ్యమయ్యే పని కాదు. ఐరోపాకు ఆత్మరక్షణ చేసుకునే సామర్థ్యం లేదు. ఒకవేళ ఈ విషయంలో సొంతంగా నిలబడాలనుకుంటే.. ఐరోపా దేశాలు రక్షణపై వ్యయాలను పెంచాల్సి ఉంటుంది. అయితే, ఐరోపా, అమెరికా పరస్పరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది" అని మార్క్ రుట్టే వెల్లడించారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామన్న ట్రంప్ హెచ్చరికలతో అమెరికా, ఐరోపా దేశాల మధ్య బంధం బీటలు వారిన సంగతి తెలిసిందే. గ్రీన్‌లాండ్‌కు మద్దతిస్తున్న ఐరోపా దేశాలపై సుంకాలను విధిస్తానని ట్రంప్ బెదిరింపులు కూడా చేశారు.

ఈ పరిణామాల నేపథ్యంలో నాటో చీఫ్ మార్క్ రుట్టే.. అగ్రరాజ్య అధ్యక్షుడితో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. గ్రీన్‌లాండ్, ఆర్కిటిక్ ప్రాంత భవిష్యత్తు ఒప్పందానికి వీరు ఓ ఫ్రేమ్‌వర్క్ రూపొందించారు. దీంతో సుంకాలపై తన నిర్ణయాన్ని ట్రంప్ వెనక్కి తీసుకున్నారు.

## 2 నిమిషాల మ్యాగీతో నెలకు 6 లక్షల ఆదాయం.. ఈ కుర్రాడి టాలెంట్ కి ఫిదా!





చలికాలంలో వేడి వేడి మ్యాగీ తినటం ఎవరికీ ఇష్టం వుండదు చెప్పండి. అందులోనూ పర్వత ప్రాంతంలో చల్లటి వాతావరణంలో మ్యాగీ దొరికితే, ఆ ఆనందం చెప్పక్కర్లేదు. మరి ఇదే ఫార్ములా పెట్టుబడిగా పెట్టి లక్షలు సంపాదించటం మీకు తెలుసా ..అవునండి మీరు విన్నది నిజమే. ఈ సింపుల్ లాజిక్?నే తన వ్యాపార మంత్రంగా మార్చుకున్నాడు కంటెంట్ క్రియేటర్ బాదల్ ఠాకూర్. పర్వతాల పైన ఒక చిన్న స్టాల్?ను ఏర్పాటు చేసి, మ్యాగీ అమ్ముతూ నెలకు లక్షల రూపాయలు సంపాదిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. తక్కువ పెట్టుబడితో కొండంత లాభాలను ఎలా సాధించవచ్చో నిరూపిస్తున్న బాదల్ సక్సెస్ స్టోరీ ఇప్పుడు యువతకు ఒక పెద్ద ఇన్‌స్పిరేషన్‌గా మారింది.

**పర్వతాల పైన మ్యాగీ మ్యాజిక్:** పర్వతాల మీద మ్యాగీ అమ్మడం అనేది చిన్న పనిలా అనిపించినా, దాని వెనుక ఉన్న బిజినెస్ మైండ్ సెట్ గొప్పది. పర్వత ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీని బాదల్ ఠాకూర్ సరిగ్గా వాడుకున్నాడు. కేవలం ఐదు గంటల వ్యవధిలోనే దాదాపు 200 ప్లేట్ల మ్యాగీని విక్రయించి ఆదాయం పొందుతున్నాడు. అక్కడ ఒక ప్లేట్ మ్యాగీ ధర రూ. 70 నుండి రూ. 100 వరకు అమ్ముతున్నాడు. అంటే రోజుకు సుమారు రూ. 21,000 ఆదాయం పొందుతున్నాడు.

ఇందులో ఖర్చులు తీసేసినా, రోజుకు కనీసం రూ. 15,000 వరకు లాభం ఉంటుందని అంచనా. ఈ లెక్కన నెలకు దాదాపు రూ. 6 లక్షల వరకు సంపాదిస్తూ, సాఫ్ట్?వేర్ ఇంజనీర్ల జీతాలను మించి ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. ఒక చిన్న మ్యాగీ ప్యాకెట్ ఎంతటి ఆర్థిక విప్లవాన్ని తెస్తుందో బాదల్ ఆదాయం చూస్తే అర్థమవుతుంది.

**తక్కువ పెట్టుబడి.. ఎక్కువ ఆదాయం:** యువతకు ఇదొక గొప్ప వ్యాపార పాఠం. ఏదైనా వ్యాపారం చేయాలంటే లక్షలు ఉండక్కర్లేదు, ప్రజల అవసరాన్ని గుర్తిస్తే చాలని బాదల్ నిరూపించాడు. మ్యాగీ తయారీకి కావాల్సిన సామాగ్రి చాలా తక్కువ, అలాగే వండటం కూడా సులభం. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల్లో వేడి వేడి ఆహారం కోసం ప్రజలు ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉంటారు. కేవలం మ్యాగీనే కాదు, ఇలాంటి చిన్న చిన్న ఫుడ్ స్టాల్స్ లేదా లోకల్ టీ పాయింట్లు పర్వత ప్రాంతాల్లో మంచి లాభాలను తెచ్చిపెడతాయి.

భారీ ఇన్వెస్ట్‌మెంట్ లేకపోయినా, ప్లానింగ్ , లొకేషన్ సరిగ్గా ఉంటే తక్కువ సమయంలోనే సెటిల్ అవ్వొచ్చని బాదల్ ఉదాహరణ చెబుతోంది. తాను మ్యాగీ అమ్మిన వీడియో ను సోషల్ మీడియా లో పంచుకున్నాడు. ఆ వీడియో చూసిన కొందరు అతని టాలెంట్ ను మెచ్చుకుంటుంటే, కొందరు మాత్రం సాఫ్ట్ వేర్ జాబ్ కన్నా ఎక్కువ సంపాదిస్తున్నావ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరికొంతమంది 2 నిమిషాల మ్యాగీ తో ఇంత లాభమా అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## విదేశాలకు విద్యార్థుల్లో ఆంధ్రా టాప్.. గమ్యస్థానాల్లో కీలక మార్పులివే!



విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థుల్లో భారతీయుల సంఖ్య ఎక్కువగానే ఉంటుందని అంటారు. అనంతర స్థానం చైనాదని చెబుతారు. ఈ క్రమంలో.. భారత్ లో ప్రధానంగా ఐదు రాష్ట్రాలు విదేశాలకు విద్యార్థులను పంపడంలో కాస్త అటు ఇటుగా టాప్ - 5లో కొనసాగుతుండగా.. వీటిలో తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ టాప్ లో కొనసాగుతోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన నీతి ఆయోగ్ డేటా దీనికి సంబంధించిన పలు కీలక విషయాలు వెల్లడించింది. అవును... ఉన్నత విద్య అంతర్జాతీయాకరణపై నీతి ఆయోగ్ విడుదల చేసిన డేటా ప్రకారం... దేశంలోని అన్ని ప్రాంతాలతో పోలిస్తే, అత్యధిక సంఖ్యలో విద్యార్థులను విదేశాలకు పంపడంలో ఐదు రాష్ట్రాలు స్థిరంగా ముందుకు కొనసాగుతుండగా.. ఇందులో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది.

ఇదే సమయంలో... ఈ సంఖ్యలో 2016, 2020 మధ్య భారతీయ విద్యార్థుల అగ్ర అధ్యయన గమ్యస్థానాలలో వచ్చిన స్పష్టమైన మార్పును ఈ నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో 2016, 2018, 2020లలో వరుసగా ఆంధ్రప్రదేశ్ టాప్ ప్లేస్ లో నిలవగా.. రెండు, మూడు స్థానాల్లో పంజాబ్, మహారాష్ట్రలు పోటీ పడుతూ, ఎక్కుతూ దిగుతూ ఉన్నాయి! ఇదే సమయంలో... నాలుగు, ఐదు స్థానాల్లో తమిళనాడు, గుజరాత్, ఢిల్లీ మధ్య గట్టి పోటీ నెలకొంటున్నా.. గుజరాత్ ఆధిపత్యాన్ని కనబరుస్తుంది. ఢిల్లీ గత కొంతకాలంగా ఐదో స్థానంలో నిలుస్తుంది. అయితే కేరళ, కర్ణాటక రాష్ట్రాలు ఈ జాబితాలో ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలవడం గమనార్హం.

**2016లో విదేశాలకు విద్యార్థులను ఎక్కువగా పంపిన టాప్ - 5 రాష్ట్రాలు!:** 1. ఆంధ్రప్రదేశ్ - 46,818 2. మహారాష్ట్ర - 45,560 3. పంజాబ్ - 36,743 4. తమిళనాడు - 27,518 5. ఢిల్లీ - 27,016

**2018లో విదేశాలకు విద్యార్థులను ఎక్కువగా పంపిన టాప్ - 5 రాష్ట్రాలు!:** 1. ఆంధ్రప్రదేశ్ - 62,771 2. పంజాబ్ - 60,331 3. మహారాష్ట్ర - 58,850 4. గుజరాత్ - 41,413 5. తమిళనాడు - 38,983

**2020లో విదేశాలకు విద్యార్థులను ఎక్కువగా పంపిన టాప్ - 5 రాష్ట్రాలు!:** 1. ఆంధ్రప్రదేశ్ - 35,614 2. పంజాబ్ - 33,412 3. మహారాష్ట్ర - 29,079 4. గుజరాత్ - 23,156 5. ఢిల్లీ - 18,482

**2016, 2020 మధ్య మారిన గమ్యస్థానాలు!:** 2016, 2020 మధ్య భారతీయ విద్యార్థులు ఎక్కడికి వెళ్లారనే దాని భౌగోళికం గణనీయంగా మారిపోయింది. ఇందులో భాగంగా... 2016లో భారతీయ విద్యార్థుల గమ్యస్థానంగా అమెరికా అగ్రస్థానంలో ఉండగా.. కెనడా, ఆస్ట్రేలియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.. యూకే ఈ జాబితాలో మరింత దిగువన ఉంది. అయితే.. 2020 నాటికి ఆ ఆర్డర్ మారిపోయింది. ఇందులో భాగంగా... ఈ జాబితాలో కెనడా అగ్రస్థానానికి చేరుకోగా.. యూఎస్ రెండో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో ఆస్ట్రేలియా ఓ ప్రధాన గమ్యస్థానంగా మారగా.. యూకే పైకి ఎగబాకింది.. జర్మనీ ప్రత్యామ్నాయంగా మారింది.

**2016లో భారతీయ విద్యార్థులు ఎక్కువగా వెళ్లిన టాప్ - 5 దేశాలు!:** 1. అమెరికా - 4,23,863 2. కెనడా - 94,240 3. ఆస్ట్రేలియా - 78,103 4. యూకే - 16,599 5. ఉక్రెయిన్ - 10,963

**2020లో భారతీయ విద్యార్థులు ఎక్కువగా వెళ్లిన టాప్ - 5 దేశాలు!:** 1. కెనడా - 1,79,480 2. అమెరికా - 1,67,582 3. ఆస్ట్రేలియా - 1,15,137 4. యూకే - 90,300 5. జర్మనీ - 35,147

## ఇక కార్లు, దుస్తులు చాలా చీప్..

భారత వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. విదేశీ కార్లు కొనుగోలు చేయాలన్నా.. బ్రాండెడ్ యూరోపియన్ దుస్తులు ధరించాలన్నా ఇకపై సామాన్యులకు భారం తగ్గనుంది. యూరోపియన్ యూనియన్‌లోని 25 దేశాలతో భారత్ కుదుర్చుకున్న కీలక వాణిజ్య ఒప్పందమే దీనికి ప్రధాన కారణం.

**ఒప్పందం ముఖ్యాంశాలు..** ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కుదిరిన ఈ చారిత్రక ఒప్పందాన్ని ఆయన "ఒప్పందాల్లో తల్లి వంటిది" అని అభివర్ణించారు. ఈ ఒప్పందం వల్ల ప్రధానంగా పలు వస్తువుల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. ఐరోపా నుంచి దిగుమతి అయ్యే వాహనాలపై భారీగా సుంకాలు తగ్గనున్నాయి. బ్రాండెడ్ దుస్తుల ధరలు అందుబాటులోకి వస్తాయి. పారిశ్రామిక రంగానికి అవసరమైన ముడి పదార్థాలు, మిషనరీ ధరలు తగ్గుతాయి. వాహన రంగంలో ఉపయోగించే స్పేర్ పార్ట్స్ ధరలు కూడా దిగిరానున్నాయి.



**ఎందుకు ఈ మార్పు?...** గత పదేళ్లుగా అంతర్జాతీయ రాజకీయాల్లో వచ్చిన మార్పులు, ముఖ్యంగా అమెరికా అనుసరిస్తున్న వాణిజ్య విధానాల వల్ల యూరోపియన్ వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. భారత్ వంటి అతిపెద్ద మార్కెట్‌ను కోల్పోకూడదనే ఉద్దేశంతో జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, బ్రిటన్, స్విట్జర్లాండ్ వంటి 25 దేశాలు భారత్‌తో చర్చలకు మొగ్గు చూపాయి.

**సామాన్యుడికి చేకూరే లబ్ధి..** ఈ ఒప్పందం వల్ల కేవలం విలాసవంతమైన వస్తువులే కాకుండా, నిత్య జీవితంలో ఉపయోగించే యంత్ర పరికరాలు, రవాణా వాహనాల ధరలు తగ్గడం వల్ల సగటు భారతీయుడి జీవన వ్యయం తగ్గే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ ఒప్పందం ప్రకారం యూరోపియన్ యూనియన్ నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే కార్లు, దుస్తులు, ముడి పదార్థాలు, మిషనరీ, రవాణా వాహనాల్లో ఉపయోగించే పరికరాలు తదితర అనేక వస్తువులపై దిగుమతి సుంకాలు తగ్గనున్నాయి. దీని ప్రభావంతో ఆయా ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఈ విషయాన్ని స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన ఈ ఒప్పందాన్ని "ఒప్పందాల్లో తల్లి వంటిది"గా ఆయన అభివర్ణించారు. ప్రపంచ దేశాలు కూడా ఈ ఒప్పందాన్ని అభినందిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం వల్ల భారత్‌కే కాకుండా యూరోపియన్ దేశాలకు కూడా వాణిజ్య పరంగా మేలు జరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా సామాన్య ప్రజలు నిత్యావసరాలకు ఉపయోగించే వస్తువుల ధరలు తగ్గడంతో జీవన వ్యయం కొంత మేర తగ్గే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే ఈ వాణిజ్య ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థకు, వినియోగదారులకు, అలాగే అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలకు ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.

## సడెన్ చేంజ్ : రాముడు కొడుకు ఆలయంకట్టిన పాక్

దాయాది పాకిస్థాన్ లో సడెన్ గా చేంజ్ కనిపిస్తోంది. భారత్ మీద ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంగా ఆరోపణలు ఎదుర్కొంటోంది పాక్. అంతే కాదు భారత్ తో వేయి ఏళ్ళ పాటు యుద్ధం చేస్తామని ఘాటైన ప్రకటనలు ఇచ్చింది కూడా ఇదే పాక్. అంతే కాదు గత ఏడాది ఏప్రిల్ లో జమ్మూ కాశ్మీర్ లో మతం ఏంటి అని అడిగి మరీ దారుణంగా 26 మంది హిందూ పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల వెనక పాక్ అండగా ఉంది అన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతిగా భారత్ పాక్ మీద ఆపరేషన్ సింధూర్ పేరుతో చేసిన ఎటాక్ తో చతికిలపడింది కూడా.

**మైనారిటీల భయం :** పాకిస్థాన్ లో ఎపుడూ మైనారిటీలు బిక్కుబిక్కుమని జీవిస్తుంటారు. పాక్ దేశంలో హిందూ జనాభా దాదాపు 5.2 మిలియన్లుగా ఉంది. ఇది 2023 జనాభా లెక్కల ప్రకారం నమోదు అయి ఉంది. అంటే మొత్తం పాక్ జనాభాలో దాదాపు 2.17 శాతంగానే హిందువులు ఉన్నారు అన్న మాట. ఇక ఈ హిందువులలో కూడా అత్యధిక జనాభా సింధ్ ప్రావిన్స్‌లోనే కనిపిస్తారు.

**విభజన నాటి సన్నివేశం :** ఇదిలా ఉంటే 1947 విభజన సమయంలో పశ్చిమ పాకిస్తాన్ జనాభాలో హిందువులు చాలా ఎక్కువ భాగం అంటే 14 శాతం కంటే ఎక్కువగా ఉండేవారు. విభజన తర్వాత పాక్ నుంచి హిందువులు భారత్ వచ్చారు. మిగిలిన వారిలో కూడా అణచివేతల మూలంగా వారంతా కూడా ఇబ్బందుల పాలు అయి జనాభా తగ్గిపోయింది. అయినప్పటికీ హిందువులు పాకిస్తాన్?లో ఈ రోజుకీ



అతి పెద్ద మతపరమైన మైనారిటీగా అక్కడ హిందువులు ఉన్నారు.

**ఇదీ ప్రస్తుతం దృశ్యం :** ఇక చూస్తే కనుక పాకిస్తాన్‌లోని హిందువులు సింధీ, మార్వారీ, గుజరాతీ వంటి వివిధ భాషలు మాట్లాడే వారంతా విభిన్న సమాజంగా అక్కడ నివసిస్తున్నారు. ఇక వీరికి పాక్ జాతీయ అసెంబ్లీలో రిజర్వ్ చేయబడిన సీట్లు ఉన్నాయి. అలాగే బలూచిస్తాన్‌లోని హింగ్లాజ్ మాతా ఆలయం వంటి ముఖ్యమైన దేవాలయాలు ముఖ్యమైన తీర్థయాత్ర స్థలాలుగా ఈ రోజుకీ పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాక్ పాలకులకు హఠాత్తుగా హిందువుల మీద ప్రేమ పుట్టింది అని అంటున్నారు.

**లాహోరు కోటలో :** పాకిస్థాన్ లోని లాహోర్ కోటలో ఉన్న శ్రీరాముడు ఇద్దరు కుమారులలో ఒకరు అయిన లవుడు ఆలయాన్ని పాకిస్తాన్ ఇటీవల కాలంలో బాగా పునరుద్ధరించింది. దానిని హిందువులతో పాటు మొత్తం ప్రజల సందర్శన కోసం అందుబాటులో ఉంచింది. అంతే కాదు సిక్కుల కోసం కూడా వారి కాలం నాటి పలు స్మారక చిహ్నాలను తెరచినట్లుగా అధికారులు చెప్పారు.

**లవుడు ఆలయంలో :** ఇక లవుడు ఆలయంలో ప్రత్యేకతలు ఏమిటి అంటే పై కప్పు ఏమీ ఉండదు, లాహోర్ కోట లోపల గదుల్లో ఉన్న మధ్యలో ఈ ఆలయం కేంద్రీకృతమై ఉంటుంది. మరో విశేషం ఏమిటి అంటే లవుడు పేరుతోనే లాహోరు అన్న నగరం ఏర్పడింది అని హిందువులు విశ్వసిస్తారు. ఆనాటి సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చెప్పడం కోసం హిందువులు, సిక్కులు స్మారక చిహ్నాలు అలాగే మొఘల్ కాలం నాటి నిర్మాణాలను పాక్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుంది అని అధికారులు చెబుతున్నారు. మొత్తానికి పాక్ వైఖరిలో అయితే ఈ విధంగా ఎంతో కొంత మార్పు రావడం మంచి పరిణామమే అని భావిస్తున్నారు.

